

- గంజాయికి బానిసైన యువకుడి ఘాతుకం
- మూడేళ్ళుగా బాలిక వెంటబడి వేధింపులు
- అవ్వ మందలింపులతో కక్ష పెంచుకున్న వైనం
- వృద్ధురాలి గొంతుకోసి....మనవరాళ్ళపై ఇనుప రాడ్‌తో దాడి చేసి పరార్



రక్తపు మరకల నడుమ జయలక్ష్మి మృతదేహం

ప్రేమోన్మాదం



స్కూటీపై పరారవుతున్న శ్రీనివాస్



మృతురాలు జయలక్ష్మి (ఫైల్‌ఫొటో)



కన్నీరుమున్నీరవుతున్న జయలక్ష్మి కుమారుడు శ్రీనివాసులు తదితరులు



ప్రేరణకు ఎమ్మెల్యే తదితరుల పరామర్శ

తిరుపతి(నేరవిభాగం), జులై 18 : గంజాయి మత్తుకు బానిసైన ఓ జులాయి విచక్షణ కోల్పోయాడు.మూడేళ్లుగా వెంటబడి తిరిగినా తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఆ యువతి కుటుంబంపై పగబట్టాడు. గురువారం చీకటిబడ్డాక ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించి వారింట్లో దూరాడు.ప్రేమ విషయంలో మందలించిందన్న కోపంతో ఆ యువతి నాయనమ్మ గొంతుకోసి చంపేశాడు.తరువాత ఆమె చెల్లెలి తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం మెట్లమీద ఎదురుపడిన ఆ యువతిపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.పోలీసుల కథనం మేరకు... తిరుపతి రాయల్‌నగర్‌లో కాపురమున్న శ్రీనివాసులు బసవయ్య అండ్ కో పేరుతో శానిటరీ మార్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నాడు.రోజూ శ్రీనివాసులు తన భార్య రక్షతో కలసి దుకాణానికి వెళ్ళేవాడు. శ్రీనివాసులు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె ప్రేరణ(18) ఢిల్లీలో బీబీఏ చదువుతోంది. చిన్న కుమార్తె నియతి(14) ఇక్కడే 9వ తరగతి చదువుకుంటోంది.శ్రీనివాసులు ఇంటి ముందు కాపురమున్న తాపీ మేస్త్రీ నరసింహులు రెండవ కుమారుడు శ్రీనివాస్ తరచూ ప్రేరణను ప్రేమ పేరుతో వెంటబడి వేధించేవాడు.ఈ విషయమై ఆమె నాయనమ్మ జయలక్ష్మి (67) పలు సందర్భాల్లో అతడిని మందలించిందని సమాచారం. సెలవులు కావడంతో ఇటీవల ప్రేరణ తిరుపతికి వచ్చింది. దీంతో శ్రీనివాసులు ఆమెను తరచూ మానసికంగా వేధించడం ఎక్కువైంది.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ప్రేరణ తన తల్లి రక్షతో కలిసి డ్రైవింగ్ నేర్చుకోవడం కోసం బయటకు వెళ్ళారు.చీకటిబడ్డాక శ్రీనివాస్ తలపై టోపీ, ముఖానికి మాస్కు ధరించి ఎదురింట్లో దూరాడు. సెకండ్ ఫ్లోర్‌లో వున్న జయలక్ష్మి దగ్గరకు వెళ్లి కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు.ఆపై ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చి అక్కడున్న నియతిని తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు.దీంతో ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగుతుండగా బయట్నుంచి వస్తున్న ప్రేరణ మెట్లమీద ఎదురుపడడంతో ఆమెపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఆమె తల్లి వద్ద స్కూటీ తాళాలు లాక్కున్న శ్రీనివాస్ కింద ఇంటి ముంగిట పార్కు చేసి వున్న బాధితుల స్కూటీలోనే పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన నియతి పరిస్థితి విషమంగా వుండడంతో ఆమెను ఎలైట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడ్డ ప్రేరణను కూడా ఆస్పత్రిలో చేర్చారు.ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందగానే ఎస్పీ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.డీఎస్పీ రవిమనోహరాచారి,సీఐలు మురళీమోహనరావు, జయనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు కూడా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డాయి.డాగ్ స్క్వాడ్ బాధితుల ఇంటి ముందు కాపురమున్న నరసింహులు ఇంటి వద్దకు వెళ్ళి ఆగిపోయింది. దీంతో పోలీసులు బాధితులను విచారించగా అసలు విషయం బయటపడింది.జయలక్ష్మి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ రాయల్‌నగర్‌కు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేరణతో మాట్లాడి పరామర్శించారు.నిందితుడు శ్రీనివాస్‌ను పట్టుకోవడం కోసం ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రూ.90 లక్షల మొబైల్ ఫోన్ల రికవరీ



స్వాధీనం చేసుకున్న ఫోన్లను మీడియాకు చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18: మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో దాదాపు 90లక్షల విలువైన 500 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. ఏఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టారు. వాట్సాప్ నెంబరు(94906 17873)కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి తొమ్మిదిసార్లు 5.45 కోట్ల విలువైన 3,030 ఫోన్లు రికవరీ చేశారు. తాజాగా మన రాష్ట్రంతోపాటు కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేసిన 500 ఫోన్లను బాధితులకు ఎస్పీ అందజేశారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే మొబైల్ ఫోన్ హంట్ అప్లికేషన్ లేదా సెంట్రల్ ఎక్విప్‌ఎమెంటు ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా ఉద్యోగులు, యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి రివార్డులు ప్రకటించి.. ప్రశంసా పత్రాలు అందజేశారు.

1నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి

- సిద్ధమైన పోలీసు యంత్రాంగం

తిరుపతి(నేరవిభాగం), జూలై 18: హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన బ్యానర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లను తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, చంద్రగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. జిల్లాలో గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జూలై పదో తేదీవరకు ద్విచక్ర వాహనాల ద్వారా ప్రమాదాలకు గురైన వారు 1200 మంది ఉన్నారు. వీరిలో 310 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 2300 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది హెల్మెట్ ధరించక పోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువల్ల హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే భారీగా జరిమానా విధించేలా చర్యలు తీసుకోనున్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా అప్పారావు

మహిళావర్సిటీకి ఉమ, ద్రావిడ వర్సిటీకి దొరస్వామి



సీహెచ్ అప్పారావు - వి.ఉమ - దొరస్వామి - విజయభాస్కరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18: వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలు ఇటీవల చేసిన రాజీనామాలకు తాజాగా ప్రభుత్వ ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఆయా యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎస్వీయూకు వర్సిటీలోని బయో కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును నియమించారు. పద్మావతి మహిళా వర్సిటీకి సోషియల్ వర్క్ విభాగ ప్రొఫెసర్ వెన్నం ఉమను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఉత్తర్వులను జారీ చేశారు. అంటిల్ ఫర్ ద ఆర్డర్ ప్రాతిపదికన వీరిని నియమించారు. వీరిద్దరూ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.అలాగే నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ విజయభాస్కరరావు నియమితులయ్యారు.కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా గ్రంథాలయ శాఖ ఆచార్యుడు ఎం.దొరస్వామి నియమితులయ్యారు.

తిరుపతి ఆర్డీవోను విచారించిన సీఐడీ

రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలంటే వారం వ్యవధి కోరిన ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని సీఐడీ అధికారులు గురువారం విచారించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు పలు అంశాలపై సమాచారం కోరారు. కోరిన సమాచారాన్ని రెండు రోజుల్లో ఇవ్వాలని సూచించారు.గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామకిషోర్, ఎస్‌ఐ మంజుల సిబ్బందితో కలసి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలసి పలు అంశాలపై విచారించారు. ఈ సందర్భంగా తమకందిన ఫిర్యాదులో పేర్కొన్న మేరకు చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, తొలగింపులకు సంబంధించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు వంటివాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆర్డీవో చెప్పినట్టు తెలిసింది. అలాంటప్పుడు చంద్రగిరి గత ఎమ్మెల్యే ప్రైవేటు కార్యాలయానికి తరచూ ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందని, అక్కడికి నియోజకవర్గంలోని తహసీల్దార్లను ఎందుకు పిలిపించాల్సి వచ్చిందని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఆర్డీవో తాను ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళడంలో తప్పేంవుందని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. ప్రభుత్వ పనులపై తాను ఎమ్మెల్యేను కలవడం, ఆయన కార్యాలయానికి వెళ్ళడం తప్పెలా అవుతుందని, తహసీల్దార్లను పిలిపించడం కూడా తప్పేమీ కాదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఓటర్ల జాబితాకు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, తన ప్రమేయం ఏమీ లేదని చెప్పినట్టు తెలిసింది. సుమారు గంటపాటు సీఐడీ అధికారులు ఆర్డీవో ఛాంబర్‌లో గడిపి అవసరమైన సమాచారం సేకరించే ప్రయత్నం చేసి అనంతరం వెనుదిరిగారు.

వెటర్నరీ వర్సిటీలో నిధుల దుర్వినియోగం

- వైసీపీ పాలనలో లాయర్ల ఫీజుకింద రూ.96లక్షల ఖర్చు
- స్టాండింగ్ కౌన్సిల్ ఉన్నా.. అదనపు న్యాయవాదుల నియామకం
- లీగల్ ఖర్చులపై ఎల్ఎఫ్ ఆడిట్ అధికారుల అభ్యంతరం



తిరుపతి రూరల్, జూలై 18 : తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో లీగల్ ఖర్చుల కింద గత వైసీపీ పాలనలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న విమర్శలు రేగాయి. వర్సిటీ ఉద్యోగుల పదోన్నతులు, బకాయిలు, నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నియామకాలు తదితర కేసులకోసం ప్రభుత్వ ధనాన్ని న్యాయవాదుల ఫీజు కింద దాదాపు రూ.96లక్షలు ఖర్చు చేసినట్లు సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో బయటపడింది.హైకోర్టులో వర్సిటీకి సంబంధించి కేసులు వాదించేందుకు 2020-2024సంవత్సరాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.రామమోహనరావును నియమించింది. ఈయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.20వేలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.దీని ప్రకారం ఈయనకు నాలుగేళ్లకు దాదాపు రూ.10లక్షలు గౌరవవేతనం ఇవ్వాల్సివుండగా.. ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించిన ఇతర న్యాయవాదులతో కలిపి రూ.96లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే అదనంగా పొన్నవోలు సుధాకర రెడ్డి(ఏఏజీ), వైవీ రవిప్రసాద్, పీవీ సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలను న్యాయవాదులుగా నియమించి వర్సిటీ అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృధా చేశారు. దీనికితోడు అప్పట్లో ఏఏజీగా ఉన్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి కూడా ఫీజు చెల్లించారని, నిబంధనల ప్రకారం ఆయనకు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కేసులకు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. లోకల్ న్యాయస్థానంలో కూడా ప్రభుత్వం నియమించిన స్టాండింగ్ కౌన్సెల్ వర్సిటీకి సంబంధించిన కేసులను ఎంగేజ్ చేయాల్సి ఉందని,అయితే ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇంటర్నల్‌గా వర్సిటీ ఉన్నతాధికారుల అనుమతితో మధుకర్‌రెడ్డి అనే న్యాయవాదిని నియమించి ఫీజు కింద రూ.6,85,200 చెల్లించారు. రెండునెలల కితం వర్సిటీలో నిర్వహించిన లోకల్‌ఫండ్(ఎల్ఎఫ్) ఆడిట్ అధికారులు ఈ ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. కోర్టును ఆశ్రయించిన ఉద్యోగులతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునే చిన్నచిన్న సమస్యలకు కూడా న్యాయవాదులకు అనవసరంగా ఫీజుకింద డబ్బు చెల్లించారని చెబుతున్నారు.ఈ నాలుగేళ్లలో హైకోర్టులో దాదాపు 60కేసులు, సుప్రీంకోర్టులో 10కేసులు దాఖలు చేయడాన్ని బట్టి ఉద్యోగుల పట్ల వర్సిటీ పాలకులు అనుసరించిన వైఖరి ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది.అలాగే 2016-17లో ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్ (రాయలసీమ, కోస్టల్ ఆంధ్రా జోన్) ప్రకారం గతంలోనూ అధికారులు చాకచక్యంగా నిధులను దుర్వినియోగం చేశారని.. కాంట్రాక్ట్ ఏజెన్సీలకు బ్యాంకు చెక్కులను సీరియల్‌గా ఇవ్వాల్సిఉండగా మధ్యమధ్యలో తమకు అనుకూలంగా మలచుకుని చెక్కులు అందించారని, మంత్లీ అకౌంట్స్‌లో నగదు లెక్కలు కూడా తారుమారు చేసినట్లు ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్‌లో నివేదించారని అంటున్నారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది ఇంతవరకు తేలలేదంటున్నారు. అప్పట్లో పోస్టల్ స్టాంప్స్‌లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కంపెనీలకు కూడా డబుల్ పేమెంట్ చేశారని కూడా ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై అప్పటి ఫైనాన్స్ అధికారులపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని ఆడిట్ రిపోర్ట్‌లో స్పష్టంగా నివేదించినా ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగుల ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. అలాగే 2020-21లో కూడా ఓ అధికారి(రాయలసీమ జోన్) కాంట్రాక్ట్ ఏజెన్సీలకు డబుల్ పేమెంట్ చేశారని, ఈ విషయం వెలుగులోకి వచ్చాక రెండు సంవత్సరాల తర్వాత ఏజెన్సీల నుంచి రికవరీ చేసినట్లు సమాచారం. ఈ అవకతవకలకు కారణమైన వారికి కనీసం మెమో ఇచ్చిన దాఖలాలు కూడా లేకపోవడమేమిటని ఉద్యోగులు నిలదీస్తున్నారు. కాగా వర్సిటీ ప్రధానకేంద్రంగా గతవారంరోజుల నుంచి అకౌంటెంట్ జనరల్ ఆడిట్(ఏజీ) జరుగుతోందని, వీటిపై లోతైన విచారణ చేపడితే నిజాలు వెలుగు చూసే అవకాశం ఉందని ఉద్యోగవర్గాలంటున్నాయి.

టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వోగా గౌతమి

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా గౌతమిని నియమించారు. గతంలో సీవీఎస్వోగా ఉన్న నరసింహకిషోర్ బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ పోస్టుకు ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. ఈ క్రమంలో టీటీడీ ఎడ్యుకేషన్, హెల్త్ జేఈవోగా ఉన్న గౌతమికి ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఆ స్థానంలో మరో ఐపీఎస్ అధికారిని నియమించే వరకు గౌతమి ఇన్‌చార్జ్ సీవీఎస్వో బాధ్యతలను చూడనున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

తిరుపతి అర్బన్, జూలై 18: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ఉదయం స్థానిక ఎన్జీవో కాలనీలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో ఓ నాయకుడి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డివిజన్‌కు 200మందిని సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సుమారు పదివేల మందిని చేర్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. సభ్యత్వం తీసుకున్నవారికి జనసేనాని పవన్‌కల్యాణ్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. దీనివల్ల అనుకోని దుర్ఘటనల్లో కార్యకర్తలు మృతి చెందితే రూ.5లక్షలు, గాయాలైతే రూ.50వేలను అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, వి.వినోద్ రాయల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జనసేన నాయకులు

చంద్రగిరి | స్థానిక వార్తలు | ఆంధ్రజ్యోతి | తిరుపతి | www.andhrajyothy.com

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ హిమ కోహ్లి

తిరుచానూరు, జూలై 18: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టుజడ్జి జస్టిస్ హిమ కోహ్లి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఏఈవో రమేష్, అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం జస్టిస్ హిమ కోహ్లిని వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

లారీని ఢీకొన్న మోటరు సైకిల్ : ముగ్గురి మృతి



మృతిచెందిన నాగమల్లయ్య, జయచంద్ర, నారాయణ

పాకాల, జూలై 18: చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లె సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలం భగవాన్ రామతీర్థ సేవాశ్రమం సమీపంలోని ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర (38), నాగమల్లయ్య (14), నారాయణ (30) మరొకరు మోటరు సైకిల్‌లో దామలచెరువు వైపు వస్తుండగా దామలచెరువు వైపునుంచి చిత్తూరు వెళ్తున్న లారీ మోటరు సైకిల్‌ను ఢీ కొంది. లారీ కిందపడి అక్కడికక్కడే ముగ్గురు దుర్మరణం చెందారు. మరొకరు గాయాలతో బయటపడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు

పాకాల, జూలై 18: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోర్ ఎన్జీవో ప్రోగ్రామ్ మేనేజర్ సద్దాం ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలనే విషయాలపై ఆశావర్కర్లకు వివరించారు. కండోమ్స్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మురళీకృష్ణ, సూపర్‌వైజర్ భగవతి, ఆశా వర్కర్లు, కోర్ ఎన్జీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందగిరిపై రేపు తలనీలాల వేలంపాట

పాకాల, జూలై 18: మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 20వ తేది శనివారం తలనీలాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో యువరాణి తెలిపారు. ఈ నెల 27 నుంచి 31వ తేది వరకు జరుగు ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం బహిరంగ వేలంలో పాల్గొనడానికి రూ.10వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పాదరక్షలు, వాహనాల పార్కింగ్, కొబ్బరిచిప్పలు పోగు చేసుకోవడానికి రూ.వెయ్యి ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. 20వ తేది శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయ ఆవరణలో వేలంపాటలు జరుగుతాయన్నారు.

ఆదర్శవంతంగా చంద్రగిరి అభివృద్ధి

- ఎమ్మెల్యే పులివర్తి నాని



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో పులివర్తి నాని

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా, రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆయన తొలిసారిగా కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నాని ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 30 ఏళ్ల తర్వాత చంద్రగిరిలో టీడీపీ గెలిచిందన్నారు. చంద్రగిరిని అభివృద్ధి చేసేందుకు తనకు శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. మొక్కు ఉన్న క్రమంలో ఐదేళ్ల తర్వాత తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం



భాకరాపేట, జూలై 18: జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మండల జనసేన అధ్యక్షుడు కొమ్మిశెట్టి రూపేష్ తెలియజేశారు. చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు ప్రారంభించామని, జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులైన చాలా మంది నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యక్షుడు సతీశ్, నాయకులు గుండాల వాసు, జయశంకర్, ప్రకాశ్, రెడ్డప్ప, రాజశేఖర్, కేశవ, భాను, బాలకృష్ణ, దినేశ్, పవన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలను ప్రభుత్వ ధరలకే విక్రయించండి



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న తహసీల్దారు

రామచంద్రాపురం, జూలై 18: నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని తహసీల్దారు ఉషారాణి కోరారు. రామాపురంలో సరసమైన ధరలకు నాణ్యమైన సరుకుల విక్రయ కేంద్రాన్ని గురువారం తహసీల్దారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భీష్మ ప్రతిజ్ఞ

రామచంద్రాపురం, జూలై 18: పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి సుమతి వినిపించిన భీష్మ ప్రతిజ్ఞ సభికులను ఆకట్టుకుంది. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం భాగవతారిణి సుమతి భీష్మ ప్రతిజ్ఞ హరికథను వినిపించారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పనిచేద్దాం

- ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే నాని పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జూలై 18: చంద్రగిరి మండల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. గురువారం చంద్రగిరి మండల సర్వసమావేశం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాని హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతికేళ్లుగా జరగని అభివృద్ధిని అన్ని పార్టీల ఐక్యతతో సాధించుకోవాలని హితవు పలికారు. చంద్రగిరిలో ఇప్పటికే గోవిందధామం పనులు ప్రారంభించామని, నాగాలమ్మ ఆలయం నుంచి శ్రీనివాసమంగాపురం వరకు రోడ్డు విస్తరణ, ఆర్టీసీ బస్టాండ్, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని, ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా, మంత్రిగా నారా లోకేశ్ ఉండటం వలన సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకటసూర్యసాయి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలాజీభవన్‌లో టీటీడీ ఈవో తనిఖీలు

- పాడైన కూరగాయలు, నాసిరకం ముడిసరుకుల గుర్తింపు
- వెంటనే హోటల్ మూసివేయాలని ఆదేశం



బాలాజీభవన్ రెస్టారెంట్‌లో ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని బాలాజీభవన్ రెస్టారెంట్‌లో టీటీడీ ఈవో శ్యామలరావు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు, వివిధ విభాగాల అధికారులతో కలిసి కౌస్తుభంలోని రెస్టారెంట్‌ను గురువారం ఉదయం తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూములను పరిశీలించారు. పాడైపోయిన కూరగాయలతో పాటు నాసిరకం ముడిసరుకులను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయలు కుళ్లిపోయినట్టు గుర్తించారు. పరిశుభ్రతా లోపాన్ని కూడా గమనించారు. భక్తుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటల్‌ను వెంటనే మూసివేయాలని ఆదేశించారు. తిరుమల హోటళ్లలో భోంచేసి అస్వస్థతకు గురైన యాత్రికుల నుంచి వరుసగా వచ్చిన ఈమెయిల్ ఫిర్యాదుల నేపథ్యంలో తాను ఎఫ్ఎస్‌డీ బృందంతో కలిసి హోటల్‌ను తనిఖీలు చేశానన్నారు. హోటల్ నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. తిరుమలలోని హోటళ్లు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేలా తనిఖీలను కొనసాగించనున్నట్టు తెలిపారు.ఎఫ్ఎస్‌డీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బాలాజీభవన్ రెస్టారెంట్‌ను ఇప్పటి వరకు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండానే నడుపుతున్నారన్నారు. హోటల్‌లో కుళ్లిన కూరగాయలు, ముందు రోజు తయారు చేసిన ఆహారం, పలుమార్లు ఉపయోగించిన నూనె, ఎఫ్ఎస్‌డీ నిబంధనలకు విరుద్ధంగా రంగు, రుచి పెంచే ముడిపదార్థాలను ఉపయోగిస్తున్నట్టు తనిఖీల్లో గుర్తించామన్నారు.వంటగదిలో చాలా దుర్వాసన వస్తోందన్నారు. దారుణంగా ఉన్న కిచెన్‌ను వెంటనే మూసివేస్తామన్నారు. క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాత హోటల్‌పై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలకు ప్రత్యేకంగా ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించామని, ఇకపై ఈ దాడులు కొనసాగుతాయన్నారు.ఈ తనిఖీల్లో ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, ఏఈవో భాస్కర్‌నారాయణ చౌదరి, తిరుపతి జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ఫుడ్ కంట్రోలర్ గౌస్ మొహియుద్దీన్, తిరుమల ఫుడ్ సేఫ్టీ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

మొబైల్ ల్యాబ్ ప్రారంభం

'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' అనే మొబైల్ ల్యాబ్ వాహనాన్ని ఎఫ్ఎస్‌డీ డైరెక్టర్‌తో కలిసి టీటీడీ ఈవో గురువారం ప్రారంభించారు. ప్రత్యేక యంత్రాలతో కూడిన ఈ వాహనం ఆహారం, నీటి నాణ్యతను తనిఖీ చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ మొబైల్ ల్యాబ్‌లో 80 రకాల పదార్థాల నాణ్యతను తనిఖీ చేయవచ్చు. దీనిని ప్రత్యేకంగా తిరుమలలో వినియోగించనున్నట్టు ఎఫ్ఎస్‌డీ అధికారులు తెలిపారు.

బాలాజీభవన్ హోటల్ లైసెన్స్ రద్దు

లైసెన్స్ ఫీజ్ సకాలంలో చెల్లించని కారణంగా తిరుమలలోని తొమ్మిది పెద్ద హోటళ్లలో ఒకటైన కౌస్తుభం బాలాజీభ వన్ హోటల్ లైసెన్స్‌ను రద్దు చేస్తున్నట్టు టీటీడీ ప్రకటించింది. ప్రస్తుతం చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు(రూ.76,04,196)కు సంబంధించి పలుమార్లు నోటీసులు జారీ చేసినా, లైసెన్స్ ఫీజు చెల్లించనందుకు హోటల్ లైసెన్స్‌ను రద్దు చేసినట్టు టీటీడీ వివరించింది.గురువారం రాత్రి టీటీడీ రెవిన్యూ, హెల్త్, విజిలెన్స్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం హోటల్‌ను స్వాధీనం చేసుకుంది.

సీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పిస్తా

- ఎంఎల్‌సీ సెంటర్, పీఎం షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే నాని



చంద్రగిరి సీహెచ్‌సీలో ఎంఎల్‌సీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూలై 18: చంద్రగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌సీ (మెడికో లీగల్ సెంటర్), పోస్టుమార్టం షెడ్డును గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం నెరవేరడానికి తనవంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రికి 50 పడకల జీవోను తీసుకొచ్చానని, మళ్లీ టీడీపీ హయాంలోనే ఎంఎల్‌సీ సెంటర్, పీఎం షెడ్డు ప్రారంభించడంతో ఆస్పత్రి మరో ముందడుగు వేసిందన్నారు. బద్ధ శత్రువైనా ఆస్పత్రిలో కల్పిస్తున్న ఎంఎల్‌సీ సెంటర్‌కు, పీఎం షెడ్డుకు రాకూడదని దేవుణ్ని కోరుకొంటున్నట్టు తెలిపారు. ఆస్పత్రికి కావాల్సిన వసతులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వైద్యశాఖ మంత్రితో మాట్లాడి రోగులకు భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. చంద్రగిరి సీఐ రామయ్య మాట్లాడుతూ మండలంలోని రెండు జాతీయ రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయని, మరణించినవారిని తరలించడానికి వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఫోన్‌లో తెలియజేయగా, ఆయన వెంటనే తన ఎంపీ నిధుల ద్వారా అంబులెన్స్ మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, తహసీల్దార్ మారుతి, ఎంపీడీవో వెంకటసూర్యసాయి. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, రమేష్‌రెడ్డి, వైద్యులు కవిత, స్వర్ణలత, శ్రీలక్ష్మి, రాగూర్, రవీంద్రనాథ్, పావన, సోమశేఖర్, చంద్రమోహన్, కీర్తి, సుష్మ, హేమంత్‌కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడునెలలుగా జీతాలివ్వకుంటే ఎలా బతకాలి?

తిరుమలలో నిరసనకు దిగిన అన్నదాన కాంట్రాక్ట్ కార్మికులు



అన్నప్రసాద భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తిరుమల, జూలై 18 (ఆంధ్ర జ్యోతి): గత మూడు నెలలుగా తమకు జీతాలు ఇవ్వడం లేదంటూ తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనం ముందు అన్నదాన విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. డ్యూటీ దిగినవారితో పాటు డ్యూటీకి వెళ్లాల్సిన వారు విధులు బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. పలువురు కార్మికులు మీడియాతో మాట్లాడుతూ.. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ తరుపున దాదాపు 524 మంది కార్మికులం అన్నప్రసాద విభాగంలో పనిచేస్తున్నామన్నారు. సంబంధిత సంస్థ గత ఏడాది నుంచి సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలల నుంచి పూర్తిస్థాయిలో నిలిపివేశారన్నారు. జీతాలు ఇవ్వకుంటే తాము ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొనసాగిన పరిస్థితే నూతన ప్రభుత్వంలోనూ కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఈవో తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అన్నప్రసాద విభాగం ప్రత్యేకాధికారి శాస్త్రి జోక్యం చేసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని నచ్చజెప్పడంతో కార్మికులు తమ విధులకు యథావిధిగా హాజరయ్యారు.

కార్మికుల సమస్యకు పరిష్కారం: టీటీడీ

నిరసనకు దిగిన కార్మికులతో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం మాట్లాడారు. సిబ్బంది జీతాలు బ్యాంక్ ద్వారా కాంట్రాక్టర్‌కు పంపించామని చెప్పారు. ఇప్పటికే మొదటి బ్యాచ్ కార్మికులకు జీతాలు పంపించామని, గురువారం రెండవ బ్యాచ్ కార్మికులకు జీతాలు కూడా వారి అకౌంట్లలో వేశామన్నారు. అన్నప్రసాదం కార్మికులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా విధుల విరామ సమయంలోనే అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నట్టు టీటీడీ తెలిపింది.

జాతీయ రహదారిపై చెత్త వేయరాదు

- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు





హైవేలో చెత్త వేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన పంచాయతీ అధికారులు, ట్రంచ్ తవ్విన దృశ్యం

తిరుపతి రూరల్, జూలై 18: బెంగళూరు జాతీయ రహదారి(150బైపాస్)పక్కన చెత్త, వ్యర్థాలను పోయరాదని సూచిస్తూ పంచాయతీ అధికారులు గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ఓటేరు పంచాయతీలో హెచ్చరిక బోర్డుతోపాటు జేసీబీతో ట్రంచ్ కూడా తవ్వారు. అలాగే గాంధీపురం పంచాయతీల్లో ట్రంచ్ తీశారు. ఇకపై గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా హైవే పక్కనే చెత్త, వ్యర్థాలు పోస్తే శానిటేషన్ సిబ్బంది నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని రూరల్ మండల ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు గుర్తించి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ




టీచర్లకు సూచనలిస్తున్న డీఈవో శేఖర్

తిరుచానూరు, జూలై 18: సమకాలిన పద్ధతులకు అనుగుణంగా బోధనలో నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని డీఈవో శేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా టీచ్ టూల్ అబ్జర్వేషన్‌పై జిల్లాలోని ఉపాధ్యాయులకు 9 రోజులు జరిగే శిక్షణా తరగతులు తిరుచానూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభం అయ్యాయి. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదిలో అభ్యసన పద్ధతులను మెరుగుపరుచుకుని ఉత్తమ బోధన అందించాలన్నారు. డీవైఈవో కె.బాలాజీ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను అబ్జర్వ్ చేసి ప్రధానోపాధ్యాయులు టీచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. తిరుపతి రూరల్ మండల ఎంఈవో దేవరాజులురెడ్డి, అసిస్టెంట్ అకాడమిక్ మానటరింగ్ ఆఫీసర్ వి.మధు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో చిరుత సంచారం

- భయాందోళనతో పక్క గ్రామాలకు తరలివెళ్లిన కాలనీ వాసులు
- చిరుత కోసం ట్రాప్ కెమెరాల ఏర్పాటు



డ్రోన్ కెమెరాతో గాలిస్తున్న అటవీ సిబ్బంది

→ జగనన్న కాలనీలో చిరుత పాదముద్రలు

చిరుత పులి కోసం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

చంద్రగిరి, జూలై 18: చంద్రగిరి మండలం, కొటాల గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో, వెనుకభాగంలో ఉన్న గుట్టలో గత మూడు రోజులుగా చిరుత పులి సంచరిస్తుంది. దీంతో జగనన్న కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం, రాత్రి జగనన్న కాలనీ వెనుక భాగంలో ఉన్న గుట్టలో పెద్ద బండరాతిపైన చిరుత పులి సంచరించింది. మళ్లీ బుధవారం రాత్రి జగనన్న కాలనీలో చిరుతపులి సంచరించినట్లు పాదముద్రలు గమనించారు. దీంతో ఆ కాలనీ వాసులు భయాందోళనతో పక్క గ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే అటవీ సిబ్బంది బాణసంచా కాల్చి, డప్పులు వాయిస్తూ, జగనన్న కాలనీతో పాటు, కొటాల, పుల్లయ్యగారిపల్లె, ఎ.రంగంపేట, నారావారిపల్లె గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. గురువారం పనపాకం ఎఫ్ఆర్వో మాధవి ఆధ్వర్యంలో జగనన్న కాలనీ వద్దవున్న అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో చిరుత కోసం గాలింపు చేపట్టారు. అయినా చిరుత జాడ కనిపించలేదు. అదేవిధంగా అటవీ ప్రాంతంలో నాలుగు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా ఉంచనునన్నట్లు ఆమె తెలిపారు.

నగదు తీసుకుంటే చర్యలు తప్పవు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



వాహన డ్రైవర్లను విచారిస్తున్న సూపరింటెండెంట్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), జూలై 18: రుయాస్పత్రిలోని మహా ప్రస్థానం వాహన డ్రైవర్లు మృతదేహాన్ని తీసుకెళ్లడానికి నగదు డిమాండ్ చేయడంపై 'కాసులిస్తేనే కదుల్తాం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై సూపరింటెండెంట్ రవిప్రభు స్పందించారు. నగదు తీసుకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మహా ప్రస్థానం వాహన డ్రైవర్లను, రోగి మృతిచెందిన ఏఎంసీ వార్డులోని సిబ్బందిని పిలిపించి విచారించారు. బాధ్యులైన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దిరెడ్డి పాపాలతోనే తిరుగుబాటు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి



వైసీపీ దాడుల ఫొటోలు రొంపిచెర్లలో గురువారం చూపుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చల్లా రామచంద్రా రెడ్డి తదితరులు

పుంగనూరు/రొంపిచెర్ల, జూలై 18 : పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం 15ఏళ్లుగా చేసిన పాపాలు, దోపిడీలతోనే ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రొంపిచెర్లలో చల్లా బాబు ఇంటి వద్ద మీడియా సమావేశంలో..తరువాత 'ఆంధ్రజ్యోతి'తోనూ ఆయన మాట్లాడారు. 'ఎంపీ మిథున్‌రెడ్డి గుట్టుచప్పుడు కాకుండా తిరుపతి నుంచి పుంగనూరుకు దొంగలా వచ్చి గొడవలు సృష్టించి ప్రజల్లో విద్వేషం పెంచాలని ప్రయత్నించారు. రైతులకు నష్టపరిహారం ఇస్తామని పిలిపించగా వారికి మద్దతుగా వెళ్లిన టీడీపీ శ్రేణులపై రాళ్ల దాడులు చేయడం దారుణం. టీడీపీ అధికారంలోకి వచ్చి 40 రోజులవుతున్నా పెద్దిరెడ్డి కుటుంబం గతంలోలాగే గొడవలు చేసే సంస్కృతి మానుకోలేదు. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన దౌర్జన్యాలు, భూదోపిడీ, అక్రమ కేసులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయి' అని స్పష్టంచేశారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు గతంలోలాగే దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని మంత్రి హెచ్చరించారు. జగన్‌లా చంద్రబాబు తప్పులు చేయరని చెప్పారు. 'మీలా 35 మంది పోలీసులను అడ్డుపెట్టుకొని మేము తిరగలేదు. మీలాగా దొంగ కేసులు పెట్టలేదు. ప్రిస్టేజ్‌కోసం, అక్రమంగా సంపాదించిన, ఆక్రమించిన ఆస్తులను కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు' అంటూ ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల ఫొటోలను ఆయన చూపారు.

నీతులుమాని గతం గుర్తుచేసుకో మిథున్

పుంగనూరు నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేదనే నీతులు చెప్పడం మాని గతంలో పుంగనూరు, కల్లూరు, సోమల మండలం నంజంపేటలో జరిగిన ఘటనలు గుర్తు చేసుకొని మాట్లాడాలని ఎంపీ మిథున్‌రెడ్డికి టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి సూచించారు. రాగాలపల్లె ప్రాజెక్టుతో 250 ఎకరాలు భూములు కోల్పోయిన రైతులు రోడ్డు మీదకు వస్తే తిరుపతి నుంచి రౌడీలను తీసుకొచ్చి దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 20 రోజులుగా ఉనికి కోసం అల్లర్లు సృష్టించాలని మిథున్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో బిల్లులు చేసుకుని రైతులను మోసం చేశారు. రాగానిపల్లె వద్ద 958 ఎకరాలు స్వాహా చేశారు. ఇసుక, గ్రానైట్ అక్రమాలతో అందరినీ ఇబ్బంది పెట్టారు. దీంతో ప్రజలు ఆవేశంగా ఉన్నారని పేర్కొన్నారు.ప్రశాంతమైన పుంగనూరులో 15 ఏళ్లుగా అరాచకాలు దౌర్జన్యాలు, దాడులు, దోపిడీలతో నాశనం చేశారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ఆరోపించారు. గతంలో తనపై దాడి చేసి.. ఇంటిని దహనం చేశారన్నారు. 'టీడీపీ ఎక్కడా దౌర్జన్యాలకు దిగదు. రైతులకు న్యాయం కోసం పోరాడుతుంది. గతంలో చిత్తూరు ఎస్పీ చారుసిన్హాను అగౌరవంగా మాట్లాడిన చరిత్ర పెద్దిరెడ్డిది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, సుహేల్‌బాషా, సద్దాం, పోలీసుగిరి తదితరులు పాల్గొన్నారు.

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు: ఎంపీ మిథున్ రెడ్డి

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, మారుతూ ఉంటుందనే విషయాన్ని టీడీపీ గుర్తించాలని ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు, మద్దతుదారులపై దాడులను ప్రోత్సహించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై రాళ్లు రువ్వడం, దాడిచేయడం దారుణమన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, దాడుల సంస్కృతి మంచిది కాదన్నారు.

సీనియర్ నేత చెలికం శంకరరెడ్డి కన్నుమూత



వెంకటగిరి/డక్కిలి, జూలై 18: విక్రమ సింహపురి ఆర్టీసీ రీజియన్ మాజీ ఛైర్మన్ చెలికం శంకరరెడ్డి(87) శుక్రవారం తెల్లవారుజామున మాధవాయపాళెంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. వెంకటగిరి సమితి అధ్యక్షుడిగా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఆయన సేవలందించారు. వెంకటగిరి రాజాల వర్గీయుడిగా రాజకీయ ఆరంగేట్రం చేసిన చెలికం సుదీర్ఘ కాలం పాటు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. నేదురుమల్లి హయాంలో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 2007లో అనుచరగణంతో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ విజయానికి కృషి చేశారు. చెలికం మరణించారని తెలియగానే ఆయన స్వగ్రామం డక్కిలి మండలం మాధవాయపాళెంలో విషాదం నెలకొంది. ఆయన భౌతికకాయానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు నివాళులు అర్పించారు. శంకరరెడ్డికి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తదితరులున్నారు.

మోటరు సైకిళ్ల ఢీ:ఒకరి మృతి



రామాంజనేయులు మృతదేహం

నాయుడుపేట టౌన్, జూలై18: నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో రెండు మోటరు సైకిళ్లు ఢీ కొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు.పోలీసుల కథనం మేరకు మేనకూరు సెజ్‌లో గురువారం రాత్రి విధులు నిర్వహించుకొని అశోక్, తేజ ఒక మోటారు సైకిల్‌పై, రామాంజనేయులు, హేమచంద్ర మరో మోటారు సైకిల్‌పై బయల్దేరారు. ఈ రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.గాయపడిన అశోక్, తేజాను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామాంజనేయులు, హేమచంద్రలను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రామాంజనేయులు (25) మృతి చెందాడు. అశోక్, తేజా, హేమచంద్రలను మెరుగైన వైద్యసేవల కోసం నెల్లూరుకు తరలించారు.




ఒకే నెంబరుతో రెండు కార్లు!
కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి నిర్వాకం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 18: ఒకే నెంబరు (ఏపీ 21 ఏజీ0099)తో రెండు కార్లను వాడుతున్నాడో కలెక్టరేట్ ఓ ఉద్యోగి. గురువారం కలెక్టరేట్‌లో ఉన్న పార్కింగ్‌లో ఈ ఈ రెండు వాహనాలూ కనిపించాయి. వీటిని చూసిన పోలీసులు విచారణ చేపట్టారు. సదరు ఉద్యోగి సమాచార శాఖలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్ కూడా వాకబు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. కలెక్టరేట్‌లోని పార్కింగ్‌లో రాత్రి 10గంటలు దాటినా కూడా పదుల సంఖ్యలో కార్లు ఉంటున్నాయి. సరైన నిఘా లేకపోవడమే దీనికి కారణమన్న విమర్శలొస్తున్నాయి.

కాలువకు మరమ్మతులు



తిరుపతి (ఆటోనగర్), జూలై 18: తిరుపతి-రేణిగుంట రోడ్డులోని హీరో షోరూమ్ ఎదుట రైల్వే గేటు మలుపు వద్ద ఉన్న కాలువకు మరమ్మతులు చేశారు. 'మురికి కాలువతో ముప్పు' శీర్షికన ఈనెల 15వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నగర పాలక అధికారులు గురువారం ఆఫ్కాన్ కాంట్రాక్టర్ సాయంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విద్యార్థుల విషయంలో బాధ్యతగా ఉండాలి : కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), జూలై 18: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థుల విషయంలో బాధ్యతగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సంక్షేమశాఖల అధికారులతో సమీక్షించారు. వంట గది, ఆహార పదార్థాలను శుభ్రంగా తయారు చేయాలని చెప్పారు. ఆగస్టు పదో తేదీనాటికి అధికారులంతా తమ పరిధిలోని అన్ని వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించి వసతులు మెరుగు పరచాలని చెప్పారు. దీనికి అవసరమైన నివేదికలు, అంచనాలను సమర్పించాలని తెలిపారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తిరుపతి, చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, రాజ్యలక్ష్మి, డీసీవో పద్మజ, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినులకు ఎమ్మెల్యే అభినందన



తిరుపతి(విద్య), జూలై 18: సీఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన మాస్టర్‌మైండ్స్ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభినందించారు. కె.తేజశ్విని జాతీయస్థాయిలో 14వ ర్యాంకు, వై.వర్షితరెడ్డి 37వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కళాశాల అడ్మిన్ ప్రిన్సిపాల్ టి.ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణంలో భారీ దోపిడి : బీజేపీ

తిరుపతి (జీవకోన), జూలై 18: జగనన్న ఇళ్ల నిర్మాణాలు, భూసేకరణలో భారీ దోపిడీ జరిగిందని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారిస్తే వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, సహకరించిన జిల్లా రెవెన్యూ అధికారులకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు చెప్పారు. జగన్న కాలనీలతో పేరుతో కుంట, కాలువ పోరంబోకు స్థలాలను, డీకేటీ భూములను తరతరాలుగా అనుభవిస్తున్న రైతులను భయపెట్టి వైసీపీ నేతలు లాక్కొన్నారన్నారు. పైగా వారికి ఎకరాకు కేవలం రూ.3లక్షలిచ్చి.. అప్పటి ఉన్నతాధికారులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని ప్రభుత్వానికి రూ.30లక్షలకు ఎకరా అమ్మారన్నారు. ఇలా ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వైసీపీ నాయకుల ఆస్తులను జప్తు చేయాలన్నారు. అలాగే పునాదులకు పరిమితం చేసి.. ఇళ్లు పూర్తయినట్లు దొంగ బిల్లులు చేసుకున్న వైసీపీ నేతలకు సహకరించిన అధికారులను జ్యుడీషియన్ ప్రాసిక్యూట్‌కు సీఎం ఆదేశించాలని కోరారు.

రేపటినుంచి హనుమ అవార్డ్స్ పోటీలు


మీడియాతో మాట్లాడుతున్న బీఎన్ రెడ్డి

తిరుపతి (ఆటోనగర్), జూలై 18: మహతి కళాక్షేత్రంలో అభినయ ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 28వ తేదీవరకు హనుమ అవార్డ్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి బీఎన్ రెడ్డి మీడియాకు వివరాలు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో దాతల సహకారంతో సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద సోలో నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ ప్రదర్శనలకు నగదుతో కూడిన బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. సంస్థ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఆ ఆరోపణల్లో వాస్తవాలు లేవు'

తిరుపతి(ఆటోనగర్), జూలై 18: ఏపీ ఒలంపిక్ సంఘం కార్యదర్శి ఆర్కే పురుషోత్తం నాయుడిపై నామిశెట్టి వెంకట్ చేసిన ఆరోపణల్లో వాస్తవాలు లేవని ఏపీ జూడో అసోసియేషన్ కోశాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉండిన వెంకట్ విజయవాడలో నకిలీ జూడో అసోసియేషన్ ఏర్పాటు చేసి, తన కుమారుడిని సెక్రటరీగా ప్రకటించుకుని అసోసియేషన్ నిధులను దోచుకున్నాడని ఆరోపించారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైందన్నారు. ఇలాంటి వ్యక్తి ఇతరులపై ఆరోపణలు చేయడంలో పసలేదన్నారు. సభ్యులు ప్రదీప్, కిరణ్ పాల్గొన్నారు.

సన్మానం



తిరుపతి (జీవకోన), జూలై 18: 'గోవింద ధావం' నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా నియమితులైన వినాయక నిమజ్జన కమిటీ సభ్యుడు ఎస్వీఎం వెంకటేష్‌ను సభ్యులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపీనాథ్, సామంచి శ్రీనివాస్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, అజయ్‌కుమార్, చెన్నం నవీన్, వాసు, గోపి, ప్రసాద్, డీపీ ఆనంద్, కరాటే శ్రీనివాస్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుపతి (కల్చరల్), జూలై 18: కపిలేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వర స్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వర స్వామి ఉత్సవర్లకు పవిత్ర ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ జరిగింది. తెలియకుండా ఆలయంలో జరిగే దోషనివారణకు ఏటా ఈ పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆచారం. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, బాలకృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన గోవిందుడి జ్యేష్ఠాభిషేకం



తిరుపతి (కల్చరల్), జూలై 18: గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం జ్యేష్ఠాభిషేకం వేడుకగా ముగిసింది. ఉదయమే స్వామివారికి సుప్రభాతం నిర్వహించారు. ఉత్సవమూర్తుల కవచాలను ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకొచ్చారు. శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలోని కల్యాణ మండపంలో అభిషేకం జరిగింది. అనంతరం కవచ ప్రతిష్ఠ, అక్షతారోహణం, బ్రహ్మఘోష నిర్వహించి, కవచ సమర్పణ చేశారు. సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామి వారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. జీయరు స్వాములు, ఆలయ అర్చకులు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సోమశేఖర్, సురేష్, చలపతి తదితర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అపోలో డయాగ్నోస్టిక్స్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), జూలై 18: ఎన్జీవో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నోస్టిక్స్ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అపోలో హెల్త్, లైఫ్‌స్టైల్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యర్, ప్రతినిధులు రాఘవేంద్రరెడ్డి, దేవేంద్రసింగ్‌రాజ్‌పుత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీలో బోధనేతర ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించేదెప్పుడు?

తిరుపతి రూరల్, జూలై 18: ఎస్వీవెటర్నరీవర్సిటీలో బోధనేతర ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ రెండేళ్ల పదవీకాలం ఏప్రిల్ 25వ తేదీతో ముగిసింది. మూడునెలలు గడిచినా కొత్త కార్యవర్గ ఎన్నికకు ఇప్పటివరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదు. గడువు ముగియక ముందే అధికారులను కలసి సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలని విన్నవించినా పట్టించుకోలేదని ఉద్యోగులు అంటున్నారు. వర్సిటీకి వీసీ లేరంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. అదే ఎస్వీయూలోనూ వీసీ లేకపోయినా ఇటీవల ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని గుర్తు చేస్తున్నారు. ఇదేవిషయమై గురువారం పలువురు ఉద్యోగులు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ చెంగల్వరాయులుని కలసి వినతిపత్రం సమర్పించారు. మాజీ ప్రధానకార్యదర్శి కె.బాలకార్తీక్, సి.మునీంద్రారెడ్డి, బి.మహేష్, మహేంద్రయ్య, మనోహర్, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకటేష్ బాబు, సుబ్రహ్మణ్యం, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్'పై నిర్ణయం భేష్

తిరుపతి(విద్య), జూలై 18: ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విద్యార్థుల కళాశాలల ఖాతాల్లో జమ చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయించడం భేషుగ్గా ఉందని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పాలిత్వ శివశంకర్‌నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.కూటమి ప్రభు త్వం ఏర్పడ్డాక విద్యా విధానంలో మార్పులు తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత నిర్ణయంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు.

కూరగాయల మార్కెట్‌కు రూ.3.21కోట్లు

- 8నెలలకే రికార్డు అద్దెను సొంతం చేసుకున్న మహిళ
- గత ఏడాది రూ.2.58 కోట్లే
- వైసీపీ నేతల కనుసన్నల్లో టెండరు లేకుండా కొనసాగింపు


టెండరు నిర్వహణలో కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కూరగాయల మార్కెట్ బహిరంగ వేలంలో రికార్డు అద్దె పలికింది. కేవలం 8నెలలకే రూ.3.21 కోట్లతో గీత అనే మహిళ అత్యధిక వేలం పాటదారుగా నిలిచి మార్కెట్ హక్కును కైవసం చేసుకున్నారు. అదే వైసీపీ అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా టెండర్ల ఊసే లేదు. వైసీపీ నేతల కనుసన్నల్లోనే 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.2.58కోట్లు మాత్రమే కొనసాగింపు ద్వారా ఆ పార్టీ సానుభూతిపరులు కార్పొరేషన్‌కి చెల్లించేవారు. ఈసారి కేవలం ఎనిమిది నెలలకే రూ.3.21కోట్లు పలికిందని, దాదాపు కోటి రూపాయల వరకు కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చిందంటే కేవలం బహిరంగ వేలం నిర్వహించడంతోనే సాధ్యమైందని ఎన్డీఏ కూటమి నేతలు చెబుతున్నారు. గురువారం కార్యాలయంలో మేయర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆధ్వర్యంలో మార్కెట్లతో పాటు పార్కింగ్‌లకు బహిరంగ వేలం నిర్వహించారు. గాంధీ రోడ్డు.. మరికొన్ని రోడ్లపై పార్కింగ్ రుసుం వసూలు చేసుకోవడానికి జరిగిన బహిరంగ వేలంలో రూ.13.5 లక్షలతో ప్రకాష్ అనే వ్యక్తి పాటను దక్కించుకోవడం జరిగింది. భారతీ బస్టాండ్ పార్కింగ్ రుసుం వసూలుకు రూ.4.75లక్షలతో శరత్ బాబు, గోవిందరాజ స్వామి మాడవీధుల్లో పార్కింగ్ రుసుం వసూలుకు రూ.93 వేలతో మునికృష్ణారెడ్డి వేలంలో పాటను దక్కించుకున్నారు. వీరంతా 8నెలల పాటు(మార్చి 31, 2025)వరకు మాత్రమే రుసుం వసూలుకు అనుమతిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ పాల్గొన్నారు

బహిరంగ వేలంతోనే పెరిగిన రుసుం

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్లకు, పార్కింగ్ స్థలాలకు తొలుత సీల్డ్ టెండర్లను కార్పొరేషన్ ఆహ్వానించింది. అయితే టెండర్ల దరఖాస్తులు ఇవ్వడంలో దుమారం రేగడంతో బహిరంగ వేలంకు కూడా కార్పొరేషన్ యంత్రాంగం అవకాశం కల్పించింది. దీంతో దరఖాస్తు తీసుకోనివారుకూడా పార్టీలకతీతంగా బహిరంగ వేలంలో పాల్గొనే అవకాశం దక్కింది. కూరగాయల మార్కెట్‌కు సీల్డ్ టెండరులో రూ.2.58కోట్లు మాత్రమే అత్యధికంగా కోట్ చేసి ఉండగా, బహిరంగ వేలం ద్వారా రూ.3.21కోట్లకు చేరింది. కాగా, పార్కింగ్‌లో మాత్రం సీల్డ్ టెండరుదారులే అత్యధికంగా ఉండడంతో వారికే కేటాయించారు.

మంచినీళ్ల గుంటను పునరుద్ధరిస్తాం : ఆరణి

తిరుపతి అర్బన్, జూలై 18: మురికికూపంలా మారిన మంచినీళ్ల గుంటను టీటీడీ ఈవో, నగర కమిషనర్‌తో చర్చించి పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఉదయం ఆయన కలుషితమైన మంచినీళ్ల గుంటను పరిశీలించారు. ఆసమయంలో కార్పొరేటర్లు స్పందించి స్విమ్స్ ఆస్పత్రి నుంచి వచ్చే మెడికల్ వేస్టేజ్ భూమిలో ఇంకిపోతుండటమే కారణమని వివరించారు. ఇక్కడున్న గోవిందరాజస్వామి విగ్రహానికి వారంలో ఒక రోజు పూజలు చేస్తారన్నారు. కర్మకాండలు నిర్వహించే గదికి మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుంట చుట్టూ చెట్లు ఎత్తుగా పెరిగిపోవడంతోపాటు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ మంచినీళ్ల గుంటలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కపిలేశ్వరాలయ ప్రాంగణంలో సమస్యలను పరిష్కరించాలని కపిలేశ్వర పురోహిత సేవా సంఘం అధికారి ప్రతినిధి గుండాకరం విజయ భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో పురోహితులు గురువారం ఎమ్మెల్యే ఆరణికి వినతి పత్రం అందజేశారు. గౌరవ సలహాదారు సంస్కార్ రాజేష్, అధ్యక్షుడు అన్నదానం అనిల్, కార్యదర్శి విజయ్‌కుమార్, గౌతమ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అధ్వానంగా పారిశుధ్యం



పైపుల నుంచి కారుతున్న నీరు - చెత్తాచెదారంతో నిండిన కలెక్టరేట్ ప్రాంగణం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 18: కలెక్టరేట్‌లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇక్కడి భవన సముదాయంలోని పైఅంతస్తు నుంచి వచ్చే వర్షపునీటి పైపులు పార్కింగ్ ప్రదేశంలో పలుచోట్ల పగలిపోయాయి. దీనివల్ల కొద్ది రోజులుగా వర్షపునీరు కారుతూ పార్కింగ్ ప్రదేశమంతా దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు కలెక్టరేట్ ప్రాంగణంలోనూ చెత్తాచెదారం పేరుకుంది. కాలువలు సైతం వ్యర్థాలతో నిండిపోయాయి. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగే ప్రదేశం పక్కన కూడా వర్షపునీరు పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతుండటం గమనార్హం. ఇకనైనా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వీఆర్‌కు వరదయ్యపాళెం ఎస్ఐ

తిరుపతి(నేరవిభాగం), జూలై 18: వరదయ్యపాళెం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ప్రతాప్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆయన్ను వెంటనే రిలీవ్ చేయాలని సత్యవేడు సీఐని ఆదేశించారు. వరదయ్యపాళెంకు ఇన్‌చార్జి ఎస్ఐగా నాగలాపురం ఎస్ఐ ఓబయ్యను నియమించారు. ఎస్ఐ ప్రతాప్‌ను ఎస్పీ డీఎస్పీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

స్విమ్స్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు 23న ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), జూలై 18: స్విమ్స్‌లోని న్యూరాలజీ విభాగంలో కాంట్రాక్టు కింద రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు ఈనెల 23న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫండెడ్ హాస్పిటల్ అథారిటీ స్ట్రోక్ ప్రాజెక్ట్ కింద ఈ పోస్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈనెల 23న ఉదయం 10గంటలకు కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

బ్రేక్ సిస్టంపై శిక్షణ

తిరుపతి(ఆర్టీసీ), జూలై 18: అశోక్ లేల్యాండ్ బీఎస్ 4, 6 బస్సులకు సంబంధించిన బ్రేక్‌సిస్టంపై 11డిపోల స్టోర్స్ సూపర్‌వైజర్లకు, మెకానిక్‌లకు నిపుణులతో సమగ్ర శిక్షణ ఇచ్చారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వాబ్కో కంపెనీ ప్రతినిధి సుమన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, గ్యారేజ్, స్టోర్స్ సిబ్బంది, మెకానిక్‌లు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం



తిరుపతి అర్బన్, జూలై 18: అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. 2022 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు 15వ తేదీవరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జాతీయ పతాకాన్ని భారీ ఫ్లెక్సీతో ప్రదర్శించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ఇలాంటి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇది కొంతకాలం తర్వాత గాలికి పడిపోవడంతో దీన్ని మూలనిలా పడేశారు. దీన్ని చూసిన జనమంతా ఇదేం పని అని ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించండి: ఎస్ఎఫ్ఐ


ఆర్ఐవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి(విద్య), జూలై 18: విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, ఆత్మహత్యలను నివారించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రావును గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. చాలా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు నిబంధనలు పాటించకుండా నడుస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి కళాశాలలకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి భగత్ రవి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 18: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. విజయవాడ నుంచి గురువారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పలు అంశాలపై జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని చెప్పారు. తాగునీటి సరఫరాపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్ఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల లక్ష్యం పూర్తవ్వాలి : 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి పనులు పూర్తికావాలని డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు పనులు పూర్తి చేయాలన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమానికి సహకారం : కార్పొరేట్ సామాజిక బాధ్యతగా న్యూఢిల్లీకి చెందిన టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రీన్ డ్రైవ్ కార్యక్రమం కింద తడ మడలంలోని శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంత సమీపంలో సుమారు 50వేల బయోడైవర్శిటీ మొక్కలను నాటే కార్యక్రమానికి సహకరిస్తామని కలెక్టర్ అన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజరు సందీప్ సుద్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఆధార్‌తో శ్రీవారి సుప్రభాత సేవకు
పోలీసుల అదుపులో బెంగళూరువాసి

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): నకిలీ ఆధార్‌కార్డుతో శ్రీవారి సుప్రభాత సేవ టికెట్‌ను పొందిన వ్యక్తిని తిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుమల శ్రీవారి ఆర్జితసేవలకు సంబంధించిన లక్కీడిప్ కోటాను టీటీడీ ఆన్‌లైన్ ద్వారా ప్రతి నెలా విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. భక్తులు తమ ఆధార్ కార్డు ద్వారా డిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటే డిప్‌లో ఎంపికైన భక్తులకు సేవా టికెట్లను కేటాయిస్తారు. అయితే బెంగళూరుకు చెందిన శ్రీధర్ అనే వ్యక్తి తనకు సన్నిహితంగా ఉన్న వ్యక్తుల ఆధార్ నెంబర్లతో అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్లు చేసేవాడు. అందులో ఏదో ఒక సేవకు టికెట్‌ను పొందేవాడు. ఆధార్ నెంబరును అలానే ఉంచి తన పేరు, ఫొటోను మాత్రం మార్చి నకిలీ ఆధార్‌కార్డు తయారు చేసి సేవల్లో పాల్గొనేవాడు. అయితే ఒకే నెంబరు నుంచి ఎక్కువసార్లు రిజిస్ట్రేషన్లు చేయడాన్ని గుర్తించిన టీటీడీ విజిలెన్స్ అధికారులు అతడిపై ప్రత్యేక నిఘా ఉంచారు.బుధవారం సుప్రభాత సేవలో పాల్గొనేందుకు వచ్చిన శ్రీధర్‌ను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఏడాది కాలంలో వివిధ ఆధార్ నెంబర్లతో దాదాపు 400 రిజిస్ట్రేషన్లు చేసి 20 సార్లు స్వామి ఆర్జితసేవల్లో పాల్గొన్నట్టు విచారణలో తేలింది. కేసును తిరుమల పోలీసులకు అప్పగించగా, వారు దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతంలో వైజ్ఞానికతపై పరిశోధించండి



తిరుపతి రూరల్, జూలై 18: సంస్కృతశాస్త్రంలో దాగిఉన్న వైజ్ఞానిక అంశాలపై పరిశోధనలు చేపట్టాలని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి పేర్కొన్నారు. జాతీయ సంస్కృతవర్సిటీలో న్యూఢిల్లీకి చెందిన సాహిత్య అకాడమీ, వర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో కాళిదాసు సాహిత్యంలో సాహిత్యక-కావ్యసౌందర్య-వైజ్ఞానిక వైభవంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సుల్లో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాచీన కాలంలోనే సంస్కృత సాహిత్యంలో గొప్ప వైజ్ఞానిక అంశాలను ఆనాటి కవులు, రుషులు వర్ణించారని గుర్తు చేశారు. వేదవర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సన్నిధానం సుదర్శనశర్మ మాట్లాడుతూ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో ప్రకృతి వర్ణన ద్వారా పర్యావరణ రక్షణ ఏవిధంగా చేయాలన్న అంశాన్ని చాలా మధురంగా, సరళంగా వర్ణించారని తెలిపారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిటైర్ట్ ప్రొఫెసర్ కె.రామసూర్యనారాయణ, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ కౌశిక్, ఎస్.సురేష్‌బాబు, సాహిత్య విభాగ హెడ్ కె.రాజగోపాలన్, డాక్టర్ భరత్ భూషణ్‌రథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.90 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 69,029 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,547 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

శ్రీవారిని గురువారం ఎమ్మెల్యేలు విజయశ్రీ, సునీల్‌కుమార్, రామకృష్ణ, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, తెలంగాణ ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్‌రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


రెండు వర్గాల మధ్య గొడవ

రాళ్ల దాడి అనంతరం టీడీపీ శ్రేణులు దహనం చేసిన రెడ్డెప్ప కారు




మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపైకి చేరిన వైసీపీ శ్రేణులు.. ఇక్కడ్నుంచే టీడీపీ వారిపై రాళ్ల దాడి చేశారు

పుంగనూరులో ఉద్రిక్తత

- రైతులతో కలిసి రాజంపేట ఎంపీని కలిసేందుకు వెళ్లిన టీడీపీ శ్రేణులు
- పోలీసులు అడ్డుకున్నా.. మాజీ ఎంపీ ఇంటికి చేరుకున్న ఆందోళనకారులు
- గో బ్యాక్ మిథున్, ముంపు రైతులకు న్యాయం చేయాలంటూ నినాదాలు
- వైసీపీ శ్రేణుల దాడిలో 12 మందికి గాయాలు
- ఆగ్రహంతో ఒక వాహనం దహనం.. మరికొన్ని ధ్వంసం

పుంగనూరు, జూలై 18: పుంగనూరులో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ పాలనలో సాగించిన ఆరాచకాలు, దాడులు, రైతులకు పరిహారం ఇవ్వకనే రిజర్వాయరు కట్టడం వంటి చర్యల నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబీకులను కూటమి శ్రేణులు అడ్డుకుంటున్నారు. ఎమ్మెల్యే, రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరుకు రాకుంటేనే ప్రశాంతంగా ఉంటామంటూ గతంలో వీరి పర్యటనలను అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం ఉదయం పుంగనూరు కొత్త ఇండ్లలోని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటికి చేరుకున్నారు. దీంతో పరిహారం కోసమని రిజర్వాయరు ముంపు రైతులను వెంటబెట్టుకుని ఎంపీని కలవడానికి టీడీపీ శ్రేణులు ర్యాలీగా బయలుదేరారు. ప్రాజెక్టు ముంపు రైతులకు న్యాయం చేయాలి.. గోబ్యాక్ మిథున్‌రెడ్డి.. అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులను నిరోధించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులు, వేధింపులు, దాడుల్లో బాధితులైన టీడీపీ కార్యకర్తలు, రైతులు ఆగ్రహంతో ఎంపీ మిథున్‌రెడ్డిని నిలదీసేందుకు బయలుదేరారు. పోలీసులు అడ్డుకున్నా.. వివిధ మార్గాల గుండా భారీ సంఖ్యలో మాజీ ఎంపీ ఇంటికి చేరుకున్నారు. కాగా, మిథున్‌రెడ్డికి రక్షణగా పుంగనూరులోని కొంతమంది, తిరుపతి, చిన్నగొట్టికల్లు, మదనపల్లె, బైరెడ్డిపల్లె, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి వందమందికిపైగా వచ్చారు. వీరిలో చాలామంది రెడ్డెప్ప ఇంటిపైన ఉన్నారు. తన ఇంటి వద్దకు వచ్చిన టీడీపీ శ్రేణుల వద్దకు రెడ్డెప్ప వెళ్లి ఎంపీ తన ఇంటికి టిఫిన్‌కు వచ్చారని షటిల్ కోర్టు చూసుకుని వెళ్లిపోతారని గొడవ చేయరాదని వారించారు. తాము గొడవ చేయడానికి రాలేదని, నేతిగుట్లపల్లి ప్రాజెక్టు ముంపు రైతులకు మద్దతుగా వారికి న్యాయం జరిగేలా వచ్చామని టీడీపీ శ్రేణులు చెప్పారు. అక్కడ్నుంచి ఎవరూ వెళ్లకపోవడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి తరిమేశారు. అదే సమయంలో మిద్దెపై నుంచి వైసీపీ శ్రేణులు రాళ్లు, కర్రలు, సీసాలతో కిందనున్న టీడీపీ వారిపై దాడులకు దిగారు. కిందనున్న వారు కుర్చీలతోనూ దాడి చేశారు.

ముందుగానే దాడులకు సిద్ధమయ్యారా?

టీడీపీ శ్రేణులు వస్తే.. వివాదం జరిగితే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు ముందస్తుగా సిద్ధమయ్యారా? ఇక్కడి ఘటనను పరిశీలిస్తే.. ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తోంది. ఎందుకంటే.. రెడ్డెప్ప ఇంటి వద్ద టీడీపీ, వైసీపీ శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు. ఆ తర్వాత మిద్దెపై నుంచి ఒక్కసారిగా రాళ్లు, బాటిళ్లు, కర్రలతో వైసీపీ శ్రేణులు దాడి చేశారు. అంటే.. ముందుగానే వీటిని మిద్దెపైకి తీసుకెళ్లి సిద్ధంగా ఉండుండాలి. టీడీపీ శ్రేణులూ ఇదే అనుమానాన్ని వ్యక్తంచేస్తున్నాయి.


గాయపడిన ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి

ఒక కానిస్టేబుల్, 12 మంది టీడీపీ శ్రేణులకు గాయాలు


గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ శ్రేణులు

రెడ్డెప్ప ఇంటి వద్ద జరిగిన వైసీపీ దాడుల్లో 12 మంది టీడీపీ శ్రేణులు, ఒక కానిస్టేబుల్‌కు రక్తగాయాలయ్యాయి. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త అస్రఫ్ చెవిపై రాయి దెబ్బ తగలడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలారు. టీడీపీ శ్రేణులు వెంటనే అతడిని వైద్యశాలకు తరలించారు. అజీం, నూర్‌షా, సుధాకర్, నాగరాజ, సయ్యద్, సుహేల్‌బాషా, వివేక్, షామిర్, ప్రసాద్‌స్వామి, సల్మాన్, సయ్యద్, పెద్దమోహన్‌నాయుడు, ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తితో పాటు ఇద్దరు జర్నలిస్టులకూ గాయాలయ్యాయి. 'ఎన్నికల అనంతరం ముంపు భూములకు పరిహారం ఇస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. దీనిపై తాము వెళ్లి ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా వైసీపీ రౌడీలు దాడులు చేశారు. బీభత్సం సృష్టించి హత్యాయత్నానికి పాల్పడ్డారు' అంటూ ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో పాటు పలువురిపై టీడీపీ నేత సుహేల్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాల ధ్వంసం


ధ్వంసమైన మిథున్‌రెడ్డి కారు

రాళ్లదాడితో టీడీపీ శ్రేణులను వైసీపీ వారు గాయపరచడంతో వీరంతా కోపోద్రిక్తులయ్యారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతోపాటు మరికొందరు వైసీపీ నేతల వాహనాలను ధ్వంసం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి వాహనంలో ఓ కత్తిని గుర్తించారు. ఒక వాహనానికి నిప్పు పెట్టి దహనం చేశారు. దట్టమైన పొగ, టైర్ల పేలుళ్ల శబ్దం, పోలీసు బలగాల మొహరింపు, వైసీపీ, టీడీపీ శ్రేణుల రాకతో కొత్త ఇండ్లు ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనల నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు.. 6.30 గంటల పాటు మిథున్‌రెడ్డి ఇంట్లోనే గడిపారు. ఆ తర్వాత పోలీసులు టీడీపీ శ్రేణులు, రైతులకు నచ్చచెప్పి పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పోలీసు బందోబస్తు నడుమ చిత్తూరు ఏఎస్పీ ఆరీపుల్లా తన వాహనంలో మిథున్‌రెడ్డిని తిరుపతికి తీసుకెళ్లారు. వైసీపీ శ్రేణులు కూడా ఒక్కొక్కరిగా వెళ్లిపోయారు. చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లా, డీఎస్పీలు విష్ణురఘువీర్, మహబూబ్‌బాషాతో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు బలగాలు చేరుకున్నాయి.

పెద్దిరెడ్డి కుటుంబ పాపాలతోనే తిరుగుబాటు: మంత్రి

పుంగనూరు/రొంపిచెర్ల: పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబం 15ఏళ్లుగా చేసిన పాపాలు, దోపిడీలతోనే ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రొంపిచెర్లలో చల్లా బాబు ఇంటి వద్ద మీడియా సమావేశంలో.. 'ఆంధ్రజ్యోతి'తోనూ ఆయన మాట్లాడారు. 'ఎంపీ మిథున్‌రెడ్డి గుట్టుచప్పుడు కాకుండా తిరుపతి నుంచి పుంగనూరుకు దొంగలా వచ్చి గొడవలు సృష్టించి ప్రజల్లో విద్వేషం పెంచాలని ప్రయత్నించారు. రైతులను నష్టపరిహారం ఇస్తామని పిలిపించగా వారికి మద్దతుగా వెళ్లిన టీడీపీ శ్రేణులపై వైసీపీ రౌడీలు రాళ్ల దాడులు చేయడం దారుణం. టీడీపీ అధికారంలోకి వచ్చి 40 రోజులు అవుతున్నా పెద్దిరెడ్డి కుటుంబం గతంలోలాగే గొడవలు చేసే సంస్కృతి మానుకోలేదు. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన దౌర్జన్యాలు, భూదోపిడీ, అక్రమ కేసులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయి' అని స్పష్టంచేశారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు గతంలోలాగే దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని మంత్రి హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డిలా చంద్రబాబునాయుడు తప్పులు చేయరని, గాంధీ మార్గంలో ప్రజల సమస్యలు తీర్చడం తమకు నేర్పారని చెప్పారు. 'మీలా 35 మంది పోలీసులను అడ్డుపెట్టుకొని మేము తిరగలేదు. మీలాగా దొంగ కేసులు పెట్టలేదు. ప్రిస్టేజ్ కోసం, అక్రమంగా సంపాదించిన, ఆక్రమించిన ఆస్తులను కాపాడుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు' అంటూ ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడుల ఫొటోలను ఆయన చూపారు.


వైసీపీ దాడుల ఫొటోలు చూపుతూ రొంపిచెర్లలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి

నీతులుమాని గతం గుర్తుచేసుకో మిథున్

నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేదనే నీతులు చెప్పడం మాని గతంలో పుంగనూరు, కల్లూరు, సోమల మండలం నంజంపేటలో జరిగిన ఘటనలు గుర్తు చేసుకొని మాట్లాడాలని ఎంపీ మిథున్‌రెడ్డికి చల్లారామచంద్రారెడ్డి సూచించారు. రాగాలపల్లె ప్రాజెక్టుతో 250 ఎకరాలు భూములు కోల్పోయిన రైతులు రోడ్డు మీదకు వస్తే తిరుపతి నుంచి రౌడీలను తీసుకొచ్చి దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. '20 రోజులుగా ఉనికి కోసం అల్లర్లు సృష్టించాలని మిథున్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో బిల్లులు చేసుకుని రైతులను మోసం చేశారు. రాగానిపల్లె వద్ద 958 ఎకరాలు స్వాహా చేశారు. ఇసుక, గ్రానైట్ అక్రమాలతో అందరినీ ఇబ్బంది పెట్టారు. దీంతో ప్రజలు ఆవేశంగా ఉన్నారు. చంద్రబాబు పాలనలో పుంగనూరు మళ్లీ ప్రశాంతంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామనాథం నాయుడు, ఉయ్యాలరమణ, రమేష్‌రెడ్డి, ధనంజయనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు: వైసీపీ

కాలం ఎల్లప్పుడూ ఒకేలా ఉండదని, మార్పు ఉంటుందనే విషయాన్ని టీడీపీ గుర్తించాలని ఎంపీ మిథున్‌రెడ్డి మీడియా సమావేశంలో సూచించారు. తమ నేతలు, మద్దతుదారులపై దాడులను ప్రోత్సహించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ ఇంటిపై రాళ్లు రువ్వడం, దాడిచేయడం దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదని, దాడుల సంస్కృతి మంచిది కాదని ఎంపీతో పాటు మాజీ ఎంపీ రెడ్డెప్ప అన్నారు.

15 ఏళ్లుగ్గా నాశనం చేశారు

ప్రశాంతమైన పుంగనూరులో అడుగుపెట్టి 15 ఏళ్లుగా అరాచకాలు దౌర్జన్యాలు, దాడులు, దోపిడీలతో నాశనం చేశారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అధికార మదంతో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడారన్నారు. గతంలో తనపై దాడి చేసి.. ఇంటిని దహనం చేశారన్నారు. 'టీడీపీ ఎక్కడా దౌర్జన్యాలకు దిగదు. రైతులకు న్యాయం కోసం పోరాడుతుంది. గతంలో చిత్తూరు ఎస్పీ చారుసిన్హాను అగౌరవంగా మాట్లాడిన చరిత్ర పెద్దిరెడ్డిది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ రెడ్డి, సుహెల్‌బాషా, సద్దాం, పోలీసుగిరి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

హెల్మెట్ ధరించండి...ప్రాణాలు కాపాడుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ తదితరులు

పుత్తూరు టౌన్, జూలై 18: ద్విచక్ర వాహన దారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ వెంకటమోహన్ పేర్కొ న్నారు. గురువారం మండ ల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణం కార్వేటినగరం కూడలిలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడే వాహనదారులు చాలామంది హెల్మెట్ లేని కారణంగానే మృత్యువాతపడుతున్నారని గుర్తు చేశారు. వాహనదారులు ప్రతిఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునికృష్ణయ్య, పుత్తూరు బార్ అసోసి యేషన్ కార్యదర్శి మురళీరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దామరగుంటను అభివృద్ధి చేయాలి



వడమాలపేట, జూలై 18: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ఉన్న దామరగుంటను అభివృద్ధి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విన్న వించారు. అమరావతిలో గురువారం కలిసి వినతిపత్రం మేరకు అందజేశారు. అప్పలాయగుంటలో 27.50 ఎకరాల విస్తీర్ణంలో దామరగుంట నిరుపయోగంగా ఉందని అందులో పుష్కరణి, పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు.

వివాదాస్పద స్థలంపై స్పందించండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించిన బాధితులు

వడమాలపేట, జూలై18: మండలంలోని ఎనమలపాలెం అరుంధతివాడ వద్ద ప్రభుత్వ భూమి దారాదత్తంపై రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని బాధితులు రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ గత 25 రోజులుగా కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తిరుమణ్యం రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. తిరుమణ్యం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 195-3 లో 5.12 ఏకరాల ప్రభుత్వ భూమి న్యాయస్థానం పరిధిలో ఉన్నా తహసీ ల్దార్ రాజసింహ నరేంద్ర ఇతరులు పేరుమీదుగా డిజిటల్ సైన్ చేసి అడంగల్‌లో మార్పి వేశారని ఆరోపించారు. ఈ విషయం పై జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో స్థలాన్ని, రికార్డులను పరిశీలించి తమ గ్రామాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. తహసీల్దార్ ను కార్యాలయం నుంచి వెల్లకుండా కార్యాలయం ఎదుట బైటాయించారు. ఎస్ఐ ధర్మారెడ్డి తహసీల్దార్‌తో బాధితులచే మాట్లాడించారు. తహసీల్దార్ సమగ్రంగా డిజిటల్ సైన్ చేస్తామంటూ రిపోర్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. సీపీఎం నాయకులు వెంకటేష్, నందయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శివ, బాలముని, అజిత్, గ్రామస్థులు దాము, రాజా, మనోహర్ మహిళలు పాల్గొన్నారు.

మార్పుకోసం జనసేన సభ్యత్వం తీసుకోండి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జనసేన నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 18: సమాజంలో మార్పుకోసం జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుపుల మహేష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు పట్టణంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం దిశగా, సభ్యత్వం పొందినవారు దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురైతే వారికి 5 లక్షల రూపాయలు వరకు బీమా పథకాన్ని వర్తింప చేసేందుకు జనసేన కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరి, పుత్తూరు మండల అధ్యక్షులు దేవా, జగదీశ్వర్, నాయకులు వెంకటముని, స్వామినాథన్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నేత చెలికం శంకరరెడ్డి కన్నుమూత


శంకరరెడ్డికి నివాళి అర్పిస్తున్న కురుగొండ్ల, సోమిరెడ్డి(ఇన్‌సెట్‌లో) చెలికం శంకరరెడ్డి(ఫైల్ ఫొటో)

వెంకటగిరి/డక్కిలి, జూలై 18 : విక్రమ సింహపురి ఆర్టీసీ రీజియన్ మాజీ ఛైర్మన్ చెలికం శంకరరెడ్డి(87) శుక్రవారం తెల్లవారుజామున మాధవాయపాళెంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. వెంకటగిరి సమితి అధ్యక్షుడిగా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఆయన సేవలందించారు. వెంకటగిరి రాజాల వర్గీయుడిగా రాజకీయ ఆరంగేట్రం చెసిన చెలికం సుదీర్ఘ కాలం పాటు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. నేదురుమల్లి హయాంలో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 2007లో అనుచరగణంతో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ విజయానికి కృషి చేశారు. చెలికం మరణించారని తెలియగానే ఆయన స్వగ్రామం డక్కిలి మండలం మాధవాయపాళెంలో విషాదం నెలకొంది. ఆయన భౌతికకాయానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు నివాళులు అర్పించారు.శంకరరెడ్డికి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి ఏఎంసీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు ఉన్నారు.

ద్రౌపదీదేవి పుర విహారం



శ్రీకాళహస్తి, జూలై 18: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో వెలసిన ద్రౌపదీ దేవి గురువారం పుర విహారం చేశారు. ద్రౌపదీ వస్త్రాపహరణం ఘట్టాన్ని వివరించారు. పాండవులు జూదంలో ఓడిపోవడంతో ద్రౌపదీదేవికి వస్త్రాపహరణం చేసే సమయంలో శ్రీకృష్ణుడు కాపాడే ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను చప్పరంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు.

నేడు అర్జున తపస్సు

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షికోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు అర్జున తపస్సు, అర్ధరాత్రి 12గంటలకు అలుగు, కుంభాగ్రం కార్యక్రమం ఉంటుంది.

హెల్మెట్ ధారణ తప్పని సరి



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి శీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, జూలై 18: ద్విచక్ర వాహన దారులందరూ హెల్మెట్ తప్పకుండా ధరించాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. కోర్టు ఆవరణం నుంచి పెండ్లిమండపం వరకు హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీ రాణి, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సత్యవేడు, జూలై 18: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణ కోరారు. గురువారం సత్యవేడులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి నేతాజీ రోడ్డు వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ ప్రశాంతి, బాబు కళాశాల ప్రిన్సిపాల్ పరంధామ్, లీగల్ వలంటీర్ సునీత, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, జూలై 18: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలోని ప్రతి ఒక్కరూ 18 నుంచి 28వ తేదీ వరకు బాధ్యతగా తీసుకుని క్రియాశీల సభ్యత్వంలో కష్టపడి పని చేయాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాని కోరారు. అనంతరం నాయకులు, జనసైనికులు, వీరమహిళలు సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సమావేశం

శ్రీకాళహస్తి, జూలై 18:రేణిగుంట రైల్వేస్టేషన్ వీఐపీ లాంచ్‌లో గురువారం కన్సల్టేటివ్ కమిటీ సభ్యులతో సమావేశం స్టేషన్ మాస్టర్ శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ రైల్వేప్రయాణీకుల భద్రత, సౌకర్యాల కల్పనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలాజీ, గోపాల్, మధుకర్, రవీంద్రన్, వేణుగోపాల్, రైల్వే అధికారులు శివప్రసాద్, నరేష్, శ్రీహరి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి 14 ఏళ్లు జైలుశిక్ష విధించాలి



బాలికపై దాడికి నిరసనగా మానవహారం

ఏర్పేడు, జూలై 18: ఏర్పేడు మండలంలో గత 7వ తేదీన ఆరేళ్ల బాలికపై లైంగిక దాడికి సంబంధించి నిందితుడికి 14ఏళ్ల జైలు శిక్ష విధించాలని అంగన్‌వాడీలు, జైభారత్ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ప్రగతి సేవా సంస్థ, జైభారత్ సంస్థ సభ్యులు ఏర్పేడు కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కరీముల్లా మాట్లాడుతూ ఆరేళ్ల బాలికపై లైంగిక దాడి సంఘటన హేయమైందన్నారు. నిందితుడికి కనీసం 14 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష వచ్చే విధంగా కేసులు పెట్టాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంగయ్య, కేవీపీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రగతి సంస్థ శిరీష, రాము, జైభారత్ నుంచి మహేష్‌బాబు, ఐసీడీఎస్, అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 18: ప్రభుత్వ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆలీ ఖాన్ తెలిపారు. మండలంలోని కంచనపుత్తూరు గ్రామ లెక్క సర్వే నెంబర్లు 461, 462, 463, 464లోని ఆక్రమణకు గురైన భూముల్లో వీఆర్వోలు, సర్పంచ్ చంద్రయ్య, గ్రామస్తుల సమక్షంలో గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కరకంబట్టు చెరువుకు ఆనుకుని గిరిజనుల కోసం గతంలో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి భూములు తమ వశం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ భూములు పక్కనే ఉన్న చెరువును కూడా ఆక్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, నాయకులు కన్నయ్యనాయుడు,మునెయ్య, శ్రీను, శ్రీనివాసులు,మురళి, రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా : బొజ్జల



ఎమ్మెల్యే బొజ్జలను కలిసి రేణిగుంట నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 18: రేణిగుంట పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఊరందూరులోని వారి స్వగృహంలో రేణిగుంట టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ శివకుమార్, జ్యోతినారాయణ, మునీర్, టీడీపీ నాయకులు ఎంజీ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సాగర్, నరసింహులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ఎదరవుతున్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఎంపీడీవోకు ఫోన్ చేసి సమస్యలను పునరావృతం కాకుండా చూసుకోవాలని, త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

నేలకూలిన విద్యుత్ స్తంభం



కేవీబీపురం,జూలై18: కేవీబీపురంలోని సాయి నగర్‌లో బుధవారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో బుధవారం రాత్రి కాలనీ వాసులకు విద్యుత్ అంతరాయం జరిగింది. ఆ వీధిలోనే రెండు చెట్లు నేలకూలాయి. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ : వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల సర్టిఫికెట్లను సకాలంలో అందించే విధంగా చేయాలన్నారు.

నాన్నను మరిపించేలా పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తా

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 18: అభివృద్ధి ప్రదాతగా కీర్తిపొందిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని మరిపించేలా పారిశ్రామిక అభివృద్ధిని సాధిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ పరిశ్రమను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ ఖండేల్‌వాల్, డిప్యూటీ సీవోవో రాజీవ్ ప్రకాష్ అధికారులతో కలసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పరిశ్రమ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం అధికారులు, కార్మికులతో మాట్లాడారు. బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ఇప్పటికే పరిశ్రమలో పనిచేస్తున్న వారందరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈడీ సురేష్, సీనియర్ మేనేజర్ దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఈసీఎల్ పరిశ్రమలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

జలవనరుల పటిష్టమే ధ్యేయం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జలవనరుల పటిష్టతే ధ్యేయంగా ఇరిగేషన్ అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల పరిస్థితులపై అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని ఆదేశించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువు కట్టల పటిష్టత దెబ్బతిన్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇక మల్లిమడుగు, బాలాజీ రిజర్వాయర్, ఎస్ఎస్ కెనాల్ ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ మదన్‌గోపాల్ పాల్గొన్నారు.

లాటరీ భూతంపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాళహస్తి, జూలై 18: శ్రీకాళహస్తిలో లాటరీ భూతంపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కోరలు చాచిన లాటరీ భూతం అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను ఆరా తీశారు. కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లుగా లాటరీ, మట్కాతోపాటు పలు అక్రమ వ్యాపారాలను యథేచ్ఛగా నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సీరియస్‌గా స్పందించారు. అక్రమ కార్యకలాపాలను కూకటి వేళ్లతో పెకలించాలని ఆదేశించారు. అనంతరం పీఆర్ అతిథిగృహంలో అక్రమ కార్యకలాపాలపై ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లు సాగిన అరాచక వ్యాపారాలను మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తా : కలెక్టరు

ఏర్పేడు, జూలై 18: తిరుపతి విమానాశ్రయ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు రికార్డులను పరిశీలించి ఖచ్చితంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఏర్పేడు మండలం వికృతమాల గ్రామానికి చెందిన 63మంది రైతులు 14ఏళ్ల కింద విమానాశ్రయ నిర్మాణానికి భూములిచ్చారు. అదే భూముల మీద కొంతమంది అప్పట్లో దొంగ రికార్డులు సృష్టించి పరిహారం పొందినట్లు రైతులు గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఫోన్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సమస్యను తెలియజేసి న్యాయం చేయాలన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వికృతమాల గ్రామస్తులు, బాధిత రైతులు గురువారం సాయంత్రం తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్.. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని వేసి రికార్డులను పరిశీలించి ఖచ్చితంగా బాధిత రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వికృతమాల గ్రామస్తులు

అటవీ చెట్ల అమ్మకాలపై నివేదిక ఇవ్వండి

ఎమ్మెల్యే ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, జూలై 18: గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులు, ప్రధాన రహదారులు మరమ్మతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అటవీభూముల్లో నీలగిరి తైలంచెట్ల అమ్మకాల్లో జరిగిన అక్రమాలపై నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు ఉదయభారతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సీఐ దివాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు. అలాగే వరదయ్యపాళెంలో కల్కి ఆక్రమించిన దళితుల భూములను వారికి స్వాధీనం చేయాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. ఆమేరకు రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

వైసీపీ పాలనలో భూ దోపిడీ జరిగింది

పిచ్చాటూరు : వైసీపీ ఐదేళ్ల పాలనలో 1.75 లక్షల ఎకరాల భూ దోపిడీ జరిగిందని ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపించారు. గురువారం పిచ్చాటూరులో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తమ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జీవో నెం.512ను జారీ చేసి భూ అక్రమాలను సక్రమాలుగా మార్చుకోవాలని వైసీపీ నేతలు యత్నించారని ఎమ్మెల్యే మండి పడ్డారు. భూ సర్వే పేరుతో పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించుకోవడం సమంజసమేనా అని ప్రశ్నించారు.

షాదీ మహల్‌ను నిర్మించండి

నాగలాపురం : పేద ముస్లింలు వివాహ, శుభ కార్యాలు జరిపించుకునేందుకు వీలుగా గ్రామంలో షాదీ మహల్ నిర్మించాలని టీపీ కోట మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలంకు వినతిపత్రం అందించారు. గురువారం వరదయ్యపాళెం మండల మీట్‌కు హాజరైన ఎమ్మెల్యే ఆదిమూలం తిరుగు ప్రయాణంలో నాగలాపురం వెళుతూ టీపీకోట వద్దవేచి ఉన్న గ్రామస్తులను చూసి, వాహనాన్ని ఆపి వారితో మాట్లాడారు. అనంతరం మాజీ సర్పంచ్ నజీర్ సాహెబ్ ఇంటికి చేరుకుని మైనారిటీ నాయకులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో షాదీ మహల్ నిర్మించాలని, ఈద్గాకు స్థలం కేటాయించాలని, ఖబరస్తాన్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు గ్రామంలోని అన్నీ హిందూ శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు బాలరాజు, మాజీ సర్పంచ్ షఫీవుల్లా, రషీద్, బాబు సాహెబ్, మహ్మద్ అలీ, దావుద్, అమీర్, ఇమాంస తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 18: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, అనంతరం అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



తారకరామనగర్, జూలై18: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో గురువారం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. హిందూ, ముస్లింలు పీర్లను అలంకరించి నేతాజీకాలనీ, తారకరామనగర్ వీధుల్లో ఊరేగించారు. పిల్లలు, పెద్దలు డప్పుల వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ పీర్లను ఊరేగించారు.

బోధనాభ్యసనలో నూతన ఒరవడికి శ్రీకారం

శ్రీకాళహస్తి, జూలై 18: బోధన అభ్యసనలో నూతన ఒరవడికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు అపర్ణ అన్నారు. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, సీఆర్పీలకు టీచ్ టూల్‌పై తొమ్మిది రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి అన్ని విభాగాల్లో తగిన జ్ఞానాన్ని సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, రీసోర్స్ పర్సన్లు సుబ్రహ్మణ్యం, వెంకటరమణయ్య, ప్రసాద్, సూపర్, పవన్ విజయ్‌కుమార్, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, తొట్టంబేడు, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, వెంకటగిరి, డక్కిలి బాలయపల్లి, పెళ్లకూరు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేధిస్తున్నారని పోలీసులకు వివాహిత ఫిర్యాదు

ఏర్పేడు, జూలై18: తన భర్తతోపాటు కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఓ వివాహిత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... పల్లం దళితవాడకు చెందిన కవిత(23)ను ఏర్పేడు వ్యాసనగర్‌కు చెందిన పవన్ మణికుమార్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం కట్నం ఇచ్చి వివాహం చేశారు. ఏడాదిగా తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని గురువారం ఆమె ఫిర్యాదు చేసింది. భర్తపవన్ మణికుమార్‌తోపాటు అతడి తల్లి లక్ష్మి, తండ్రి వెంకటరమణయ్య, అక్క నీరజపై కేసు నమోదు చేశారు.

ఆడికృత్తిక తెప్పోత్సవాల పోస్టరు ఆవిష్కరణ



పిచ్చాటూరు, జూలై 18: పిచ్చాటూరు మండలంలోని రామగిరి శ్రీవాలీశ్వర స్వామి దేవాలయ ఆడికృత్తిక తెప్పోత్సవ పోస్టరును గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయానికి అనుబంధంగా ఉన్న కుమార సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో జరిగే ఆడికృత్తిక ఉత్సవాలు జయప్రదం చేయాలని స్థానికులను, అధికారులను కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే భరణి, కృత్తిక, రోహిణి తెప్పోత్సవాలకు వేలాదిగా వచ్చే భక్తుల సౌకర్యాల కోసం పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని ఆలయ ఈవో లత, ఎస్ఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు. రామగిరి నుంచి ఆలయం వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను వారంరోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్‌రెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వెంకటేశులునాయుడు, నాయకులు పద్దురాజు, వాసురెడ్డి, నాగరాజు, సుమాంజలి, రాజేంద్ర, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతు గ్రూపులను ఏర్పాటు చేయాలి

సత్యవేడు, జూలై 18: ప్రతి గ్రామంలో మహిళా రైతు గ్రూపులను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి సంఘమిత్రలను ఆదేశించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం వెలుగు ఏపీఎం స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన సంఘమిత్రల సమావేశంలో పీడీ మాట్లాడుతూ వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో మహిళా రైతు గ్రూపుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి గ్రామంలో 15మంది మహిళలతో రైతు గ్రూపులను ఏర్పాటు చేసే బాధ్యత సంఘమిత్రలదే అన్నారు. మండలంలో 150 గ్రూపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం



శ్రీకాళహస్తి, జూలై 18: పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద గురువారం ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో వీర మహిళలు గాయత్రి, శారద ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత హాజరై పేదలకు అన్నదానం చేశారు.

వరదయ్యపాలెం ఎస్ఐ ప్రతాప్ వీఆర్‌కు బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జులై 18 : వరదయ్యపాలెం ఎస్ఐ ప్రతాప్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు గురు వారంరాత్రి ఆదేశాలు జారీచేసారు. ఆయన్ను వెంటనే రిలీవ్ చేయాలని సత్యవేడు సీఐని ఆదేశించారు. వరదయ్యపాలెంకు ఇన్‌ఛార్జి ఎస్ఐగా నాగలాపురం ఎస్ఐ ఓబయ్యను నియమించారు. ఎస్ఐ ప్రతాప్ ఎస్పీ డీఎస్పీ వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో వ్యాసాశ్రమ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, జూలై 18: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి దర్శించుకున్నారు, ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు.దర్శనానంతరం మృత్యుంజస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక,తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల వితరణ



కేవీబీపురం, జూలై 18: మండలంలోని పాతపాళెం గ్రామ టీడీపీ నాయకులు ఓళ్ళూరులోని సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఆదిమూలం చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో గోపి, యేసు, రామరాజు, ప్రసాద్, రాజా, ఆశీర్వాదం, ప్రవీణ్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం : అంబూరుకు చెందిన టీడీపీ యువజన నాయకుడు ఆణిముత్యం నందికిషోర్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఎమెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పలు ప్రభుత్వ కార్యాలయాలకు అందజేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వరదయ్యపాళెం, జూలై18: మండలంలోని కోవూరుపాడులో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. యానాదివెట్టు పంచాయతీ కోవూరుపాడు మిట్టఇళ్లలో ఉంటున్న ప్రభావతి శ్రీసిటీలో పనిచేస్తోంది. మంగళవారం ఆమె విధులకు వెళ్లడంతో ఆమె అమ్మ సాయంత్రం ఇంటికి తాళం వేసి గడ్డి కోసం వెళ్లింది. రాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా బీరువాలు తెరచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. గురుతెలియని వ్యక్తులు బీరువాలో దాచిన 47గ్రాముల బంగారు నగలు, రూ.15 వేలు నగదు, 200 గ్రాముల వెండి సామగ్రి అపహరించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వరదయ్యపాళెం,జూలై18: వరదయ్యపాళెంలో గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేలలోని సారవంతాన్ని పెంచి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు రాష్ట్రప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. సహాయ వ్యవసాయ సంచాల కులు సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి ద్వారకానాథ్, విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు సుమన్, పవన్, పద్మ, సోని, గీర్వాణి పాల్గొన్నారు.

రేణిగుంటలో సైకిల్ చోరీ

రేణిగుంట, జూలై 18: రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పక్కన నిలిపి ఉంచిన ఓ సైకిల్‌ను గురువారం ఓ దొంగ దొంగలించాడు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఓ ప్రైవేటు పాఠశాలకు ఓ విద్యార్థి సైకిల్‌లో వచ్చి పాఠశాల ముందు పార్కింగ్ చేసింది. మధ్యాహ్నం ఓ దొంగ దర్జాగా టీషర్టుపై ఖాకీ షర్టు వేసుకుని సైకిల్‌స్టాండ్‌లో ఉన్న విద్యార్థి సైకిల్‌ను దొంగతనం చేయడం అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. పోలీసులు దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.